


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

102

(13 డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

ఎక్కడ చూచినా సంఘాలు, సంఘాలు. అంతులేని సంఘాలు.

తెల్లవారిన తర్వాత లేచి పత్రిక చూస్తుంటే ఏవో కొత్త సంఘాలు కొన్ని కనిపించి తీర్తాయి. అందులో కొన్ని వింతవింత సంఘాలు. కొన్ని విచ్చలవిడి సంఘాలు. కొన్ని పనిలేని సంఘాలు కొన్ని పనివుండి చెయ్యలేని సంఘాలు.

మొత్తం మీద అనేక సంఘాలు. అనేకమంది అధ్యక్షులు, అనేకమంది కార్యదర్శులు. అంతులేనంతమంది కార్యనిర్వాహక వర్గ సభ్యులు. చేసే నిర్వాకాలు లేకపోయినా చెప్పుకుని సంతోషించడానికి అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటారు.

ఇక తీర్మానాలంటారా? అంతులేదు. సలసలలాడే నూనె బూర్లె మూకుడు దగ్గిరపెట్టుకుని, తలో జంతిక చుట్టు వత్తి అందులో పారేస్తారు. ఒకరు పిండిగొట్టంలో కూరితే, మరొకరు వత్తడంలో వత్తాసు చేసి, దాన్ని బలపరిచామని సంతోషపడతారు.

కొన్ని సభలు రెండురోజులు. కొన్ని నాలుగు రోజులు. బోలెడు ఖర్చు, బోలెడు హంగామా. ఏమైతేనేం కొన్ని తీర్మానాలు చేయాలిగా! తమ పార్టీ ప్రగతి కోసం పడే ఆదుర్దా బయట పెట్టుకోవాలిగా.

ఆ తీర్మానాల జంతికలు ఒక పెద్ద జంగిడి నిండుతాయి. వేడివేడివి పత్రికలద్వారా ప్రజలకు పంచిపెడతారు. కొన్ని చదువుతుంటేనే నూనెకంపుకొడతాయి. కొన్ని మర్నాటికి కొడతాయి. అయినా ఈ సభలు, తీర్మానాలూ అంతులేకుండా జరుగుతూనే వుంటాయి. సముద్రస్నానంలో నూనె మిఠాయి దుకాణాలలాగా తీర్మానాల జంతికలు తయారుచేసి పోస్తూనే వుంటారు.

ఇదివరలో అయితే దేశ క్షేమం, దేశాభ్యుదయం, మాతృభక్తి, మతసామరస్యం, దీన జనోద్ధరణ, విద్యావ్యాప్తి మొదలైన విశేషాలను గురించి పెద్దలు తీర్మానాలు చేసే నేతి పిండివంటల్లాగా ఎంతో రుచిగా వుండేవి. కొన్నాళ్ళు ఘుమఘుమలాడుతూ నిలవ వుండేవి.

అప్పుడిన్ని సంఘాలు లేవు. ఇన్ని సమస్యలు కూడా లేవు. కాంగ్రెసు సంస్థ వుందంటే దేశ దాస్య విముక్తికి సంబంధించిన విషయాల మీదే తీర్మానం చేసేది. అందరూ ఎంతో కుతూహలంతో వాటిని అంగీకరించేవారు.

స్వాతంత్రం వచ్చిన తర్వాత కాంగ్రెసు నెత్తిమీద అనేక బాధ్యతలు పడ్డాయి. అవి ఒక పట్టున తీరేవి కాదు. పట్టుబడితే ఇట్టే మారేవి కావు. కాంగ్రెసు సంస్థ భారత జాతీయ జీవనాన్ని శుభప్రదంగా, శాంతిప్రదంగా, స్వయంపోషకంగా అన్నిటినీమించి ఔన్నత్యపూరితంగా తయారు చేయాలని పూనుకుంది. మరి దీనికి ఎన్ని సంఘాలు కావాలి?

పైన చెప్పిన సదభిప్రాయంతో ప్రారంభమైన పంచవర్ష ప్రణాళికలను అమలుపరచడానికి ఎన్ని సంఘాలు? ఎన్ని ఉప సంఘాలు? ఎన్ని తాత్కాలిక సంఘాలు? ఎన్ని చిరంజీవి సంఘాలు? వీటినన్నిటినీ ప్రజలూ, ప్రభుత్వం మార్కండేయాభివృద్ధిరస్తూ అని దీవిస్తూ కూర్చోవడం జరుగుతోంది.

ఒక్క వ్యవసాయ రంగంలో ఎన్ని సంఘాలు. అప్పులిచ్చే సంఘం, మంచి విత్తుల సేకరణ సంఘం, పంపిణీ సంఘం, నీటిపారుదల సంఘం, మురుగు నిరోధక సంఘం, పంటల అభివృద్ధి సంఘం, ధరల పెంపుదల సంఘం ఇలాటివి జనరల్‌గా ఎన్నో వున్నాయి. ఇటీవల ఎక్కడో చదివాను. పచ్చి జీడిపప్పుల సంఘం, వేగించిన జీడిపప్పు సంఘం, అఖిలభారత జీడిపప్పు అభివృద్ధి సూచన సంఘం, అంతర్జాతీయ జీడిపప్పు ఎగుమతి సంఘం.

ఇలా ఎన్నెన్ని వస్తువులున్నాయో అన్నిటిమీద దరహాస దశ సంఘాలన్నీ ఉద్భవించాయి. ఉపసంఘాల మాట వూహకు వదిలి వేద్దాం పోనీ.

సంఘాల ప్రయోజనాలు రెండు విధాలు. ఒకటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్ణయించడం - రెండు తమ హక్కులకు భంగం రాకుండా చూచుకోవడం. మూడవ ప్రయోజనం కూడా ఒకటి వుందిగాని దాన్ని ఎక్కువగా ఉదాటించడం నా భావం కాదు. వూరికే వుటుంకించడమే - ఈ తృతీయ ప్రయోజనం పదవులపై అభిలాష.

అభిలాష ఆత్మకు పరిభాష. ఏ ఆత్మ ఎలా ప్రోత్సహిస్తుందో మనమేం చెప్పగలం? అది ఒక మనస్సులో వేసే ముడులు మరొకరు ఎలా విప్పగలరు? పదవులను ఆశించడం ఆత్మను పోషించుకోవడమే అవుతుంది. కనుక ఆ విషయాన్ని వదిలేద్దాం.

ఒక్క కాంగ్రెసులో ఇప్పుడెన్ని సంఘాలు వెలిసాయి? మీవి పదియిళ్ళు కావాలని కొందరు దీవిస్తూ వుంటారు. ఎవరు దీవించారో తెలియదుగానీ, కాంగ్రెసు సంస్థ ఐదేమిటి పాతిక ఇళ్ళుగా మారిపోయింది. ఇంకా వృద్ధిపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఒక్కొక్క రాష్ట్రంలో చక్కగా మూడు నాలుగు కాంగ్రెసు సంస్థలు వెలుస్తున్నాయంటే ఎంత సంతోషం? వీటి ఆశయాలలో కూడా ఎక్కువ భేదం వుండదు. ఏదో పదవుల శాఖ అనేది ఒకటి వుండవచ్చు. పదవుల అన్వేషణ శాఖ అనేది బైటికి కనిపించకుండా ఒకటి ప్రాకులాడుతుంటే వుండవచ్చు.

అది మినహాయిస్తే ఆశయాలన్నీ ఒక్కటే అందరూ ఖద్దరు కడతారు. అందరూ గాంధీ జన్మదినోత్సవాలు జరుపుతారు. అందరూ స్వాతంత్ర్య దినోత్సవంనాడు జెండా ఎగరవేస్తారు 'వందేమాతరం' అని పాడుకుని పరవశమవుతూనే వుంటారు.

మొత్తం మీద ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెసు సంస్థ ఈనాడు శాఖోపశాఖలుగా వర్ధిల్లుతోంది. అలంకారప్రాయమైన తాత్కాలిక సంఘాలు, తాత్కాలిక పదవులు కూడా ఏర్పడి ఎంతో ముచ్చటగురవుతున్నాయి.

ప్రగతి మీద అభిమానం గలవారు ఎవరైనా సరే. క్రొత్త సంఘాలు నెలకొల్పుకోవడానికి ఆలోచించవలసిన పనిలేదు. ఆలస్యం చెయ్యవలసిన పనిలేదు. ఏ సమయంలోనైనా విఘ్నేశ్వరపూజ చెయ్యవచ్చు. తెల్లవారేటప్పటికి విశాల భారతదేశమంతా వారి పేరు ప్రాకిపోతుంది.

కాంగ్రెసు మహా సమర సమయంలో లాఠీదెబ్బలకు మోకాళ్ళు విరిగిన వారు ఆ మహాయజ్ఞంలో తమ సిరి అంతా స్వాహా చేసి పాపర్ల జాబితాలో పడ్డవాళ్ళు తెలివితేటలూ నిజాయితీ, నిబద్ధతా, అందరికంటే ఎక్కువ పర్సెంటు దేశభక్తి వుండి అరణ్యావాసంలో, అజ్ఞాతవాసంలో వున్న వాళ్ళూ.

ఇప్పటికీ గాంధీ జపం చేస్తూ అహింసపేరిట దుప్పటి కప్పుకుని, ఆకలి దప్పికలమాట ఆలోచించకుండా, అందరికీ అందిన పట్టుకొమ్మ మనకు అందలేదనే నైరాశ్యంలో పడకుండా ప్రణవ జపం చేసేవారు.

ఇలాటివారు వేరువేరుగా సంఘాలు స్థాపించలేరుగానీ లేకపోతే ఈపాటికి కాంగ్రెసు మహావృక్షం శతశాఖలు ధరించి, ఎన్నెన్నో రకాల జీవులకు ఆశ్రయమిస్తూ వుండేది.

దేశగీతాలు ఒక కొమ్మను వినిపిస్తూంటే - వైతాళిక గీతాలు ఒక కొమ్మని పూస్తుంటే ప్రభృతాలు, పల్లవి తప్పకుండా పాడి వినిపిస్తూ వుండేవి.

కొన్ని శాఖలమీద రామచిలుకలు వ్రాలి ముద్దుపలుకులు పలుకుతూ వుంటే కొన్ని కొమ్మలమీద వృద్ధపావురాలు ఏవో సుద్దులు పలుకుతూ వుండేవి.

Post your comments